# ప్రకృతి మనిషిని తరిమేసింది

— కోలపల్లి ఈశ్వర్

టక్ టక్ టక్... టక్టక్... టక్టకట్...

టైపు రైటర్ శబ్దంకాదు. తను ఆఫీసులో లేదు. మార్కెట్లో కూరగాయలు బేరం చేస్తోంది. అయితే తక్కెడ చప్పుడా?

మళ్ళీ అదే శబ్దం...

క్షణంలో క్షణం సేపట్లో వాస్తవ ప్రపంచంలోకి వచ్చింది కామాక్షి. తను మంచంపైన పడుకుని కలగంటోందన్నమాట!

పగటిపూట కలేంటి— తిన్నదరక్కపోతే కలలొస్తాయని వనజ చెప్పిందోసారి బాగా ఎక్స్‌పీరియన్సున్నట్టు చెబుతుంది ప్రతీ విషయాన్ని. వనజ సంగతి తరువాత చూడొచ్చుగానీ... ఆ సౌండేంటో?

లేచి చీర సర్దుకుంది. ఈసారి టక్‌టక్‌లతో అది తలుపుమీదనుంచి వస్తున్న శబ్దమని గ్రహించి, విసుక్కుంటూ తలుపు వైపు నడిచింది. సెలవు రోజునకూడా మనిషిని శాంతిగా బ్రతకనివ్వరు... వెధవ లోకం, వెర్రిలోకం, తిక్క మనుషులు...

తలుపు గడియని బలంగా తీయడం, ధడేల్న తలుపులు తెరవడం ద్వారా తన విసుగుని ప్రదర్శించింది కామాక్షి.

వచ్చింది స్త్రీ... అయితే వనజ కాదు. వనజ కాని ఆ అమ్మాయి, ఓ చిరునవ్వుని పారేసింది యాంత్రికంగా... దూరదర్శన్‌లో నమస్కారం చెప్పే వ్యాఖ్యాతలా.

ఆమె గొంతు సవరించుకుని, చేతిని భుజానికున్న సంచీవైపు పోనివ్వడం గమనించి... వెంటనే విరుచుకు పడింది ఆవిడపై —కామాక్షి కోపంగా.

'సేల్స్‌గర్ల్‌కి మేనర్సుండాలి. తలుపు కొట్టి మరీ మీ ప్రొడక్టుని చూపించనక్కర్లేదు. ఏది వాడినా ఒకటే ఉపయోగం. ఏదీ నగం ధరకి పర్మినెంట్‌గా రాదు. టీవీల్లో, పత్రికల్లో, సినిమాల్లో యాడ్స్ చూపిస్తూనే వున్నారుగా వద్దన్నా ఆపకుండా! కంఠతా వచ్చేసాయి అవన్నీ. అయినాం ఇంకేం పని దొరకదన్నట్టు ఈ ప్రొఫెషన్లోకి వస్తారేంటి మా ప్రాణం తీయడానికి! వెళ్ళమ్మా వెళ్ళు. ఈ మహానగరంలో టైం తప్ప అన్నీ డిస్కౌంట్‌లో ఇవ్వగలవాళ్ళే. వెళ్ళు ఎవర్నీ డిస్టర్బ్ చేయకు, నువ్వూ డిస్టర్బవకు."

ఎట్లా తెరిచిందో ఆట్లాగే మూసేసింది తలుపుల్ని గొణుక్కుంటూ కిచెన్‌లోకి వెళ్ళి, చల్లారని కోపాన్ని... పాత్రలని విసురుగా లాగి, కింద పెడుతూ కొంత ఉపశమనం పొందింది కామాక్షి. అసలందుకే కాలింగ్ బెల్ కూడా ఆఫ్ చేస్తుంది.

పని మనిషి వచ్చేవేళయింది. ఇండియన్ రైల్వేస్‌లాగా మనిషిలోని ఓపికని టెస్ట్ చేస్తుంటుంది పనిమనిషి, టైమ్‌కి వచ్చి చావదు. అంతలోనే తన ఎక్స్‌ప్రెషన్లో దొర్లిన అపశ్రుతికి ఆందోళన పడింది. వచ్చి చావదు.. అనుకుందా? ఛస్తే? అమ్మో... ఆవిడ చస్తే తనకి చావే. పని మనుషులు చావడం వుండకూడదు... రావడం వుండాలి.

పాత్రలన్నీ తలుపు దగ్గిర ప్రోగయ్యాక, వాట్ నెక్స్ట్? అనుకుంది కామాక్షి. వెళ్ళి పడుకుంటే? లాభం లేదు... మళ్ళీ నిద్రపట్టే ఛాన్సులేదు. అదంతే! తన గురించి తనకి బాగా తెలును.

ఇక్కడ జీవన విధానంలో ఎవరి గురించి వారికే తెలుస్తుంది. అదే ఇంట్లోని మరొకరిక్కూడా తెలియదు.

చేయాల్సిన పనులు చేయలేనన్ని వున్నాయి. అన్నీ చేయలేకపోయినా... చేయగలిగినవన్నీ చేస్తూపోవాలి.

హాల్లోకి వచ్చింది కామాక్షి. పేరుకి హాలు అనుకున్నా అది మామూలు గది మాత్రమే. కాకపోతే హాలులో వుండాల్సిన సామాగ్రి అంతా అక్కడే వుండడం చేత హాలు అని పిల్చుకోవాలి.

సోఫాలో కూలబడి, టీపాయ్ మీదున్న వీక్లీ అందుకోబోతుండగా టెలిఫోన్ కిలకిలా. ఫోన్లుకూడా మనిషిని తీయగా పిల్చే ప్రయత్నం. కానీ కృత్రిమత్వంలో సహజత్వం ఎలా వుంటుంది కనక!

హలో...

ఎవరూ లతా? అవతలినుంచి మగ గొంతు. ఎవరిదో అర్థం కాలేదు.

లత కాదు...


మరి? కామాక్షికి అర్థమైంది కేసు.

లతకాని మరొకరు.

ఏ నెంబర్‌కి డైల్ చేశారు?

ఇక్కడ నెంబర్ కనిపిస్తోంది. కరెక్టే మీరెవరు చెప్పండి!

లతని కావన్నదు ఎవరైతే ఏం?






అయినా ఈ నెంబర్లో ఏ లతా లేదు.

అరె తను మీ ఫ్లాట్‌లోకి రావడం చూశానే! మీరు లత ఫ్రెండనుకుంటాను. మీ పేరు చెప్తారా?

"తమ్ముడు నేనా మీ అక్కయ్యని" అందామనుకునీ, అలా అంటే అక్కయ్యా అంటూ ఫోన్‌చేసే అవకాశం ఇచ్చినట్టవుతుందనీ –కామాక్షి తనను తాను కంట్రోల్ చేసుకుంటూ–

చూడండి నేను మురళీధర్ తల్లిని మాట్లాడుతున్నాను. ఇక్కడ లతలెవరూ దొరకరు అంది కామాక్షి పళ్ళబిగువన.

"మురళీధరా? వాటీజ్ హి?"

"హి ఈజ్ తార్నాక ఎస్.ఐ"

ఫోన్ కట్టయింది.

కామాక్షికి నవ్వు రాలేదు. రోజూ ఇలాంటివి మామూలే. ఒక్కోసారి వెంటనే ఏమీ చెప్పకుండా కట్ చేస్తుంది. టైంవుంటే ఇలాంటి ఏదో ఒక ట్రిక్ ప్లేచేస్తుంది. ఫోన్‌ని ఇలాంటి పనులకు దుర్వినియోగం చేసేవాళ్ళని వెంటనే గుర్తించేందుకు ఏదైనా కనుక్కోరేం? ఇంటర్‌నెట్‌లో ప్రపంచాన్ని చూడొచ్చు – ఫోన్‌ద్వారా. కానీ ఫోన్ చేసి తమాషా చూసే వాణ్ణి చూసే సౌకర్యం ఇంకా రాలేదు.

త్వరలో ఇంటర్‌నెట్ మెంబర్‌షిప్ తీసుకోవాల్సి రావచ్చు.

ఇప్పుడున్న ఛానెళ్లలోని ప్రోగ్రాంలే చూడలేక చస్తుంటే అదొకటి. అప్పుడు మనిషికి వచ్చే ఐడియా ఒక్కటేనేమో!

మనిషికి తిండీ, నిద్ర అవసరం లేకుండా చేయడానికి ఏదైనా మార్గం వుంటే బావుండును అనే ఆలోచన. ఎందుకంటే ఇక్కడ జీవించడానికి టైం లేదు...

వనజ వస్తానంది–

కామాక్షి కొలీగ్ వనజ. ఇద్దరూ కలిసి సెలవురోజుని ఎంజాయ్ చేద్దామనుకున్నారు. ఎక్కడెక్కడికి వెళ్లాలో ప్లాన్ చేసుకున్నారు.

మధ్యాహ్నం దాటిపోతుంది. వనజ ఎందుకు రాలేదు?

షాపింగ్‌కి వెళ్లాలి. సినిమాకి వెళ్లాలి. ఎగ్జిబిషన్ ఏదోవుంది– దానికి వెళ్ళాలి. రవీంద్రభారతికి వెళ్లాలి...

పిల్లలూ, భర్తా... ఎన్నెన్నో పనుల మధ్య బిజీగా వుండిపోయి వుంటుంది వనజ... అనుకుంది కామాక్షి.

ప్రభాకర్ క్యాంపు కెళ్లడంతో తనకేమీ తోచడంలేదు. తమకి ఇంకా పిల్లలు కలగనందుకు బాధగానే వున్నా, ఒక్కోసారి అనిపిస్తుంది–

ఇప్పడే ఇంత బిజీగా క్షణం తీరిక లేని రొటీన్ లైఫ్‌లో కూరుకుపోయి వున్నానే... ఇక పిల్లలతో గడపడానికి వీలవుతుందా? అని

తన వూహకి నవ్వుకుంటుంది. అందరికీ వీలవుతున్న విషయం, తనకి వీలు కాకపోవడమేమిటి? కాకపోతే తనకు ఓపిక తక్కువ. అంతే!

అయినా కొన్నాళ్లు ఇలానే గడిచిపోనీ... ఆరోజు వస్తే ఆ సుఖం, ఆ కష్టం అప్పడే అనుభవించవచ్చు.

కామాక్షికి హైదరాబాద్ సంబంధం కుదిరినప్పుడు, ఎక్కడో పల్లెలోని తను, తన కుటుంబ సభ్యులందరితోపాటు సంతోషంతో ఉప్పొంగిపోయింది. నిజానికి ప్రభాకర్‌తో ఆమెకి చికాకులేవీ లేవు. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఒకరంటే మరొకరికి మంచి అవగాహనే వుంది.

ఈ నాలుగేళ్ల నగర జీవితంలో ముందుకి పరిగెత్తడమే తప్ప, వెనక్కి తిరిగి స్మృతుల సరిగంగ స్నానాల జోలికే పోలేదు. రోజురోజుకీ విసుగు, చిరాకు పెరుగుతున్నట్టు అనుమానంగా వుంది ఆమెకి.

కామాక్షి వెళ్లి వసారాలో నిల్చుని కిందికి చూసింది. కాలనీలో జన సంచారం అంతగాలేదు. సిమెంట్, ఇసుకలతో పుట్టిన మనుషుల్లా... ఏమీ పట్టనట్టు, మరెవరితోనూ సంబంధం లేనట్టు... అంతటా ఎత్తైన భవనాలు.

గాలులు వీచేందుకు చెట్లులేవు. వర్ణమిశ్రమాలతో, కనువిందుచేసి, కవితాస్పర్శ కలిగించడానికి... సూర్యాస్తమయాలూ, చంద్రోదయాలు ఇక్కడ కనిపించవు.

ఇక్కడ వుండేవి రెండే తెగలు. మనుషులూ, భవనాలు.

కామాక్షి ఫ్లాట్ వైపు వస్తూ కొరియర్ అబ్బాయి... వెళ్ళి కొరియర్ పార్సిల్ తీసుకుని రశీదుతో సంతకం చేసింది. కరెస్పాండెన్స్‌లో చేయడానికి మరో కోర్సుకి సంబంధించిన బుక్స్! మరో సర్టిఫికెట్ పొందేలోగా, ఇంకో ఎడ్వాన్స్‌డ్ కోర్సు వస్తుంది. అదీ చేయాలి.

విశ్రాంతి వుండదు – శాంతి వుండదు.

సరేగానీ – పని మనిషి ఏదీ? వచ్చేసింది – నేరుగా వంటింట్లోకి వెళ్ళిపోతోంది. చకచకా పాత్రలు తీసుకుని తన డ్యూటీలో నిమగ్నమై పోయింది. అంతే! టైం లేదు. అరగంటలో

పనులన్నీ పూర్తి చేసి, మరో ఫ్లాట్ కెళ్తుంది.

భారంగా నిట్టూర్చి, మళ్లీ సోఫా దగ్గరకు వచ్చింది. టీవి ఆన్ చేద్దామా అనుకుంది. మూడ్ లేదు.

'హలో – ఏమిటీ – లేటయిందని కోపంలో వున్నావా ఏం?' వనజ ప్రత్యక్షమైంది.

'హమ్మయ్య.. వచ్చావుగా – కోపం పోయింది గానీ, ఇంతాలస్యమైందేమిటే?' కామాక్షి కాఫీ కలపడానికి వెళ్తూ అంది.

'సంసారం – సాగరం!'

కామాక్షి నవ్వింది. 'నిజమా?'

'నగరంలో వుంది గరం – లేనేలేదు సాగరం – సంసారంలో వుంది సారం – సమ్ సారం!'

మళ్ళీ నవ్వింది కామాక్షి. కాఫీలు తాగేసి, రెడీ అయి, వడివడిగా నడుస్తూ, రోడ్డు మీదకు వచ్చి ఆటో ఎక్కారు ఇద్దరూ.

'స్కూటర్ తేలేదేం?' అడిగింది కామాక్షి.

'పార్కింగ్‌తో సఫరింగ్ ఎందుకూ? హాయిగా వుంటుంది ఆటోలో!'

వనజ తనకి బాగా నచ్చిన ఫ్రెండ్. చాలా మంచి హృదయం గల వ్యక్తి అనుకుంటుంది కామాక్షి ఎప్పుడూ.

కామాక్షి మూడీగా వుండటం చూసి అడిగింది వనజ – 'ఏమిటే – ఆలోచిస్తున్నావా?'

'ఆలోచనా? మనకి అలవాటుల తప్ప ఆలోచనలెక్కడివి గానీ – ఈ రోజు మన ప్రోగ్రాం ఏంటి?'

ఆశ్చర్యంగా చూస్తూ. లిస్టు చెప్పకు పోయింది వనజ.

'షాపింగ్ – ఎగ్జిబిషన్ – సినిమా వగైరా వగైరా'.

'వద్దు' అంది కామాక్షి.

'మార్చావా?'

'అవును. గుడికి వెళ్దాం'


'బిర్లా మందిర్ వైపు వెళదామా?' అంటూ ఆటో వాడికి చెప్పింది – వనజ ఆటు పోనిమ్మని.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాక, మెట్లకు వస్తూ కబుర్లలో పడ్డారు.

'దేవుడిని ఏం కోరుకున్నావ్?' నడెస్గా అడిగింది వనజ. ఇలాంటి ప్రశ్నలెప్పుడూ వేయదు తను.

'నువ్వేం కోరుకున్నావో చెప్పు ముందు' వెంటనే జవాబు స్ఫురించక అంది కామాక్షి.

'బస్ – ఇలాగే గడచిపోనీ భగవంతుడా – కర్ఫ్యూలు, కల్లోలాలు




లేకుండా చూస్తే చాలు – మిగిలిన సంగతి మేం చూసుకుంటాం' అంది నవ్వుతూ వనజ.

'భగవంతుడి పేరు మీదేగా ఆ గొడవలన్నీనూ! ఏమిటో... తన గురించి కొట్లాడుకునే మనుషుల్ని, ఆయన ఎలా క్షమిస్తున్నాడో బోధపడదు. నాకు మాత్రం గుడిలో దేవుడికి నమస్కరించడం తప్ప, కోరుకోవడం అలవడ లేదు'.

విచిత్రంగా చూసింది వనజ. 'నిజమా?'

నవ్వింది కామాక్షి.

రెస్టారెంట్‌కి వెళ్ళారు ఇద్దరూ. స్వీట్‌కి ఆర్డరిచ్చింది వనజ. ఆ తరువాత టాపిక్ – వనజ ఇంటి సంగతులు.

రెస్టారెంట్ నుంచి బయటపడి, ఆటోకోసం ఎదురు చూస్తున్నారు. సమయం ఎనిమిది కావస్తోంది.

'ఏయ్ వనజా–' నల్లబార్డరులో నను పురంగు చీర కట్టుకున్న యువతి, వాళ్ళని సమీపించింది.

వనజ ఆవిణ్ణి గుర్తుపట్టి 'సుమతీ – నువ్వా– బాగున్నావా?' అంటూ కుశల ప్రశ్నలు ప్రారంభించింది.

కామాక్షి సుమతి మొహాన్ని పరీక్షగా చూసింది. 'ఎక్కడో చూసినట్టుగా వుంది' అనుకుంది. నిముషం తరువాత గుర్తుకొచ్చింది – తన ఇంటికి వచ్చిన సేల్స్ గర్ల్ ఆమె. వెంటనే కామాక్షి ముఖం ముడుచుకుపోయింది. తప్పు చేసిన దానిలా. గిల్టీగా ఫీలవసాగింది. ముఖం తిప్పుకుని ఎటో చూస్తుంటే –

వనజ, సుమతిని కామాక్షికి పరిచయం చేసింది.

'నా కజిన్. పల్లెటూళ్ళో వ్యవసాయ కుటుంబం. డిగ్రీ చదివింది. ఇప్పుడు హైదరాబాద్‌లోనే వుంటోందట'.

కామాక్షి ఇబ్బందిగా చూస్తూ 'అలాగా' అంది. సుమతి మొహంలో ఏ భావాలూ లేవు. చిరునవ్వు కాక పోయినా, సీరియస్‌నెస్ లేని ఫీలింగ్. ఇంకా చెప్పకు పోతోంది వనజ–




'ఒకప్పుడు బాగా బ్రతికిన వాళ్ళే. విధి వక్రించింది. ఇద్దరు అక్కల పెళ్ళిళ్ళు చేయగలిగాడు మా బాబాయి. కానీ దీని వంతు వచ్చేసరికి దురదృష్టం కాటేసినట్టయింది'.

'ఏం జరిగింది?' అని అడగలేదు. కానీ ఆసక్తిగా వింటోంది కామాక్షి.

'పత్తి పంట వేశాడు. ఐదెకరాల పొలం. ఖరీదైన విత్తనాలు, పురుగుల మందులు కొనడం కోసం అప్పులు చేశాడు. విత్తనాలు సకాలంలో పడక, కల్తీ మందుల ప్రభావంతోనూ – ప్రకృతీ, మనిషీ కలిసి పగబట్టినట్టుగా – పంట దిగుబడి రాకపోవడంతో, పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు బాబాయి. వనజ గొంతులో బాధ స్పష్టంగా అర్థమవుతోంది.

'అయ్యయ్యో' అంది అప్రయత్నంగా కామాక్షి బాధగా.

'పొట్ట చేత పట్టుకుని, పట్నం చేరారు పిన్నీ, సుమతీ. జీడిమెట్లలో చిన్న గది తీసుకుని వుంటున్నారు. వాళ్ళ పల్లెకి చెందిన ఓ పెద్దాయన వాళ్ళకి అండగా నిలిచాడు. ఆయన ఇంటికి దగ్గర్లోనే వీళ్ళు వుంటున్నది. సుమతి ప్రస్తుతానికి సేల్స్‌గర్ల్‌గా చేస్తోంది. నాకు అప్పట్లో లెటర్ రాసినా, వీలు చిక్కలేదు కలవడానికి' క్లుప్తంగా చెప్పింది వనజ.

నిర్లిప్తంగా చూస్తున్న సుమతి ముఖంలోకి.... సూటిగా చూడలేకపోయింది కామాక్షి.

మట్టిని నమ్ముకున్న రైతుని పల్లె నుంచే కాదు – ప్రపంచం నుంచే తరిమేస్తోంది ప్రకృతి. పల్లెల్లో ప్రజల కన్నీటి కథలు ఇవి.

నాగరికత విష వృక్షం నీడన చేరిన మనిషికి, పట్నంలో వెతలే తప్ప, పల్లెల్లో ఏం జరుగుతుందో పట్టించుకునే తీరికేదీ!

పల్లె మోసం చేస్తే – పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు – పట్నం చేరిందీ సుమతి. ఇక్కడ ఆమె భవితవ్యం ఏమిటో ఎవరూ చెప్పలేరు. పట్టణం నిండా ఎన్నో వేల వేల మంది నిర్భాగ్యులు... సుమతిలాగే!

ఇంటింటికీ తిరిగి ... మనిషి రూపొందిస్తున్న కొత్త రకం వస్తువుని... కొత్త కొత్త మనుషులకి చూపించి... కొత్త కొత్త అనుభవాల్ని ... చిరునవ్వుతో స్వీకరించేందుకు!!! ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్న మాటలు –

'అసలు మీలాంటి వాళ్ళెందుకొస్తారీ ప్రొఫెషన్లోకి.....?' *